నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I హైదరాబాద్, శనివారం 20 ఏప్రిల్ 2024 YADADRI BHUVANAGIRI


## 22లోగా పోస్టల్ బ్యాలెట్ ఫామ్ అందజేయాలి

- జిల్లా ఎన్నికల అధికారి దాసరి హరిచందన

నీలగిరి, ఏప్రిల్ 19 : ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు, అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులందరికీ ఫారం-12ను ఈ నెల 22లోగా అందజేయాలని, సంబంధిత శాఖల అధికారులు కూడా ధ్రువీకరణ ఇవ్వాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్‌పై జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా శాఖల ద్వారా ఎంత మంది ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం-12 జారీ చేసింది, ఎంతమంది తిరిగి ఇచ్చింది డిక్లరేషన్ ఇవ్వాలని ఆదేశించారు. ఏ ఉద్యోగి కూడా పోస్టల్ బ్యాలెట్ రాలేదని ఫిర్యాదు చేయకూడదని, ఒకవేళ అలాంటి ఫిర్యాదులు వస్తే సంబంధిత శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర సేవలు అందించే శాఖల ఉద్యోగులు, డ్రైవర్లు, ఆఫీసు సబార్డినేట్లు సైతం పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, పక్కన డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు హరిశంకర్‌గౌడ్

# కాంగ్రెస్ నాలుగు నెలల పాలనకే ప్రజలు విసుగెత్తిపోయిండ్రు

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- అర్వపల్లిలో బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారం ప్రారంభం

అర్వపల్లి/శాలిగౌరారం, ఏప్రిల్ 19 : కాంగ్రెస్ నాలుగు నెలల పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌తో కలిసి అర్వపల్లి మండల కేంద్రం నుంచి శుక్రవారం ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బూడిద భిక్షమయ్యగౌడ్‌తో కలిసి క్యామ మల్లేశ్ యోగానంద లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోలాటాలు, డప్పుచప్పుళ్లతో అర్వపల్లి వై జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అడ్డగోలు, అమలు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని అన్నారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. నిరుద్యోగ భృతి, కల్యాణలక్ష్మి, తులం బంగారం, మహిళలకు 2500, నెలకు 4 వేల పింఛన్, రైతు భరోసా ఇప్పటికీ ఇయ్యలేదన్నారు. రెండు లక్షల రుణమాఫీ అమలు కాలేదని, రైతు కూలీలకు 12 వేల ఊసేలేదన్నారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చి నేడు వాటిని విస్మరిస్తున్నారని ఈ విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ప్రాజెక్టుల్లో నీళ్లు ఉన్నా కనీసం ఇవ్వడానికి చేతగాని అసమర్థ ప్రభుత్వమని పేర్కొన్నారు. కోమటిరెడ్డి బ్రదర్స్ మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్నారు తప్ప ప్రజలకిచ్చిన హామీలపై ఏనాడూ మాట్లాడడం లేదన్నారు. పాలన చేయమంటే తప్పించుకొని తిరుగుతున్న దద్దమ్మ రేవంత్ అని విమర్శించారు. దేశానికి, రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందని ఓటేయాలని ప్రశ్నించారు. ఓట్ల కోసం తెలంగాణ నీళ్లను ఇతర రాష్ట్రాలకు మళ్లించుకోవాలని కుట్రలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రెండు పార్టీలో ఏ పార్టీకి ఓటు వేసినా మోరీలో వేసినట్టే అని అన్నారు. మన ఆశలు నెరవేరాలంటే ఢిల్లీలో బీఆర్ఎస్ ఉండాల్సిందేనని చెప్పారు. ప్రతి కార్యకర్త కేసీఆర్‌లా పని చేసే బీఆర్ఎస్ అభ్యర్థి, బలహీన వర్గాల నాయకుడు, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ, జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్‌పై పూర్తి వ్యతిరేకత వచ్చిందని, బీఆర్ఎస్ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలువబోతున్నారని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ.. ఎప్పుడూ ప్రజల పక్షాన నిలిచే పార్టీ బీఆర్ఎస్ అని, పార్లమెంట్‌లో తెలంగాణ గలాన్ని వినిపించే బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం శాలిగౌరారంలో జరిగిన ప్రచారంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు, రైతులు సంతోషంగా ఉన్నారని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఓటర్ బీఆర్ఎస్‌కు జై కొట్టి కారు గుర్తుకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. అనంతరం యాదాద్రి భువనగిరి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. కేసీఆర్ పదేండ్ల పాలనలో ఒక్కసారైనా పొలాలు ఎండిపోలేదన్నారు. తాగు, సాగునీటి కోసం ఏనాడూ ప్రజలు, రైతులు ఇబ్బందులు పడిన దాఖలాలు లేవన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే కరువు తాండవిస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో సూర్యాపేట జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు, జడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్, పార్టీ మండలాధ్యక్షులు గుండగాని సోమేశ్‌గౌడ్, ఐతగోని వెంకన్నగౌడ్, రాష్ట్ర నాయకులు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, మొరిశెట్టి ఉపేందర్, చాడ హతీష్‌రెడ్డి, గుండా శ్రీనివాస్, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజిలాల్ శేఖర్‌బాబు, కొన్‌రెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, గంట శంకర్, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, దాసరి వెంకన్న, అక్కెనపెల్లి శ్రీరాములు, చివుట సైదులు, వేల్పుల నరేందర్, పాల్గొన్నారు.



అర్వపల్లిలో ఎన్నికల ప్రచారం ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎంపీ బడుగుల, మాజీ ఎమ్మెల్యేలు కిశోర్, భిక్షమయ్యగౌడ్



శాలిగౌరారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కిశోర్, పక్కన ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, మాజీ ఎమ్మెల్యేలు రవీంద్రకుమార్, భిక్షమయ్యగౌడ్



అర్వపల్లిలో బీఆర్ఎస్ ప్రచారానికి పెద్దఎత్తున హాజరైన జనం

### హామీలను అమలు చేయని కాంగ్రెస్‌ను బొందపెట్టాలి

**- మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్**

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌ను, సీఎం రేవంత్‌రెడ్డిని ఎంపీ బొందపెట్టాలని అన్నారు. గత ఎన్నికల్లో పాలు ఇచ్చే బర్రెను అమ్ముకొని దున్నపోతును తెచ్చుకున్నట్లు ప్రస్తుతం రాష్ట్రంలో పాలన ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా రైతుబంధు, 2 లక్షల రుణమాఫీ, కల్యాణలక్ష్మి, తులం బంగారం, రూ.2500 ఏమయ్యాయని ప్రశ్నించారు. మనమంతా కలిసికట్టుగా పని చేసి భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించి గులాబీ దళపతి కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని అన్నారు.

### మీ సేవకుడిగా వస్తున్నా ఆశీర్వదించండి : క్యామ మల్లేశ్



బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ.. మీ సేవకుడిగా ముందుకు వస్తున్నాను. తనను ఆదరించి ఆశీర్వదించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ పిలుపునందుకొని భువనగిరి ఎంపీ అభ్యర్థిగా వచ్చానని, మీ బిడ్డగా, మీ అన్నగా, మీలో ఒకడిగా ఆశీర్వదిస్తే జీవితాంతం పని చేస్తానని తెలిపారు. తనను గెలిపిస్తే పార్లమెంట్‌లో తెలంగాణ ప్రజలకు కావాల్సిన వనరులను కొట్లాడి సాధిస్తామన్నారు. ప్రజలు గమనించి మోసకారి కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని సూచించారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీని బొంద పెట్టాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి
- భువనగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు ఖాయం
- నేడు ఆత్మకూరు(ఎం)లో రోడ్‌షో

ఆత్మకూరు(ఎం)/రాజాపేట, ఏప్రిల్ 19 : రైతులను బాధపెడుతున్న కాంగ్రెస్‌ను, తెలంగాణ అభివృద్ధికి సహకరించని బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో బొందపెట్టి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను అధిక మెజార్టీతో గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆత్మకూరు(ఎం), రాజాపేటలో నిర్వహించిన మండల స్థాయి బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాల్లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని, నేడు ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడగడానికి వస్తారని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాకే ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ చేసిన దొంగ వాగ్దానాలను బీఆర్ఎస్ శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. కేంద్రంలో తెలంగాణ వాణి వినిపించాలంటే భువనగిరి ఎంపీగా బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను గెలిపించాలన్నారు. శనివారం ఆత్మకూరు(ఎం)లోని శివాలయం నుంచి సాయంత్రం 4 గంటలకు భువనగిరి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ రోడ్‌షో ప్రారంభమై భువనగిరి-మోత్కూరు ప్రధాన రహదారి వరకు కొనసాగనుందని, మండల ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కోరారు.

### కాంగ్రెస్ వచ్చింది.. కరువు తెచ్చింది : డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి

డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. 2014కు ముందు రాష్ట్రంలో ఏర్పడిన కరువు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ రావడంతో ప్రజలంతా బాధపడుతున్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామిలన్నీ మాయమయ్యాయన్నారు. అధికారంలోకి రాగానే రైతులందరికీ రూ. 2లక్షలు రుణమాఫీ చేస్తామని వాగ్దానం చేసిన రేవంత్‌రెడ్డి నేడు ఆగస్టు 15 తర్వాత రుణమాఫీ చేస్తానని దొంగ మాటలు చెబుతూ రైతులను మోసం చేస్తున్నాడని విమర్శించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు, దళితబంధు కోసం వేల కోట్ల నిధులు మంజూరు చేస్తే వాటిని ఎక్కడికి మళ్లించారని ప్రశ్నించారు. అన్ని వర్గాల ప్రజలు నేడు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్‌ను 50వేల మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఆయా సమావేశాల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సుదగాని హరిశంకర్‌గౌడ్, రాజాపేట ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, జడ్పీటీసీ చామకూర గోపాల్‌గౌడ్, మండల మహిళాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రాంరెడ్డి, అర్కాల గాల్‌రెడ్డి, చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మోత్కుపల్లి జ్యోతిప్రవీణ్, బీఆర్ఎస్ ఆత్మకూరు(ఎం)మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, మామిడి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మండలాధ్యక్షుడు బాషబోయిన ఉప్పలయ్య, ఎంపీటీసీ యాస కవిత, నాయకులు పాల్గొన్నారు.



జిల్లా ఎన్నికల అధికారి హన్మంతు కె.జెండగేకు నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

## రెండో రోజు ఐదు నామినేషన్లు

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : భువనగిరి పార్లమెంట్‌కు సంబంధించి నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. రెండో రోజు శుక్రవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో కార్యాలయంలో ఆర్వో హన్మంతు కె.జెండగేకు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు సమర్పించారు. బీజేపీ నుంచి బూర నర్సయ్యగౌడ్, సీపీఎం నుంచి మహ్మద్ జహంగీర్, సోషలిస్ట్‌పార్టీ(ఇండియా) అభ్యర్థి రచ్చ సుభద్రారెడ్డి ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థులుగా మెగావత్ చందునాయక్, రేకల సైదులు వేర్వేరుగా ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నెల 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29 వరకు నామపత్రాల ఉపసంహరణకు అవకాశం ఉంది.

### బూర నర్సయ్యగౌడ్ ఆస్తులు రూ.27.59 కోట్లు

బీజేపీ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ నామినేషన్ అఫిడవిట్‌లో తన ఆస్తులను ప్రకటించారు. ఆయనకు వ్యక్తిగతంగా రూ.27,59,98,302 ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో చూపించారు. ఇందులో రూ.7,74,90,802 స్థిరాస్తులు, 19,85,07,500 చరాస్తులు ఉన్నాయి. బ్యాంక్‌ల నుంచి రూ.1,28,17,844 లోన్ రూపంలో అప్పు తీసుకున్నారు. ఆయన భార్య పేరున రూ.1,45,60,147 చరాస్తులు, రూ.10,23,76,250 స్థిరాస్తులు ఉన్నాయి. తనపై ఎలాంటి క్రిమినల్ కేసులు పెండింగ్ లేవని పేర్కొన్నారు. పలు రకాల లగ్జరీ కార్లు కలిగి ఉన్నట్లు చూపించారు.

# ధాన్యం రవాణాకు లారీల కొరత

**నిలిచిపోయిన ఎగుమతి**

- 'లారీ'ల సిండికేట్.. కృత్రిమ కొరత సృష్టి!
- జిల్లాలోని పలు మండలాల్లో ఇదే పరిస్థితి
- ఎక్కడికక్కడ పేరుకుపోయిన ధాన్యం రాశులు
- వర్షం ముప్పుతో ఆందోళనలో అన్నదాత
- కొర్రీలు పెడుతూ బీ-గ్రేడ్‌కు కొంటున్న వైనం



### వారం నుంచి పడిగాపులు

రెండున్నర ఎకరాల్లో వరి ధాన్యం పండిస్తే 51 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. వారం క్రితం ఆ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చా. ధాన్యాన్ని తూకం వేసి బస్తాల్లో నింపారు. లారీలు రావడం లేదని ధాన్యాన్ని ట్రాన్స్‌పోర్ట్ చేయడం లేదు. వర్షం ఎప్పుడొస్తుందోనన్న భయం ఉంది. వర్షం వస్తే ధాన్యం బస్తాలు తడిస్తే ఇబ్బంది పడాలి. తడిసి ధాన్యాన్ని తిరిగి ఎండబెట్టాల్సి వస్తుంది. ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు చేపట్టాలె. లారీల యజమానులతో మాట్లాడి వెంటనే ట్రాన్స్‌పోర్టు చేసేలా చర్యలు తీసుకోవాలి.

– రేగు చంద్రం, రైతు, మోటకొండూర్

యాదాద్రి భువనగిరి, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ) : యాసంగి ధాన్యం కొనుగోళ్లు, రవాణా అస్తవ్యస్తంగా నడుస్తున్నది. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు లారీల కొరత ఏర్పడుతున్నది. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్ మిల్లులకు ధాన్యం రవాణా నిలిపోతున్నది. లారీలు సిండికేట్‌గా మారి కొరత సృష్టిస్తున్నారని, అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ధాన్యం రాశులు ఎక్కడికక్కడ నిలిపోతుండటంతో వర్షం ముప్పుతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### ధాన్యం రవాణా చేస్తలే..

యాసంగి సీజన్‌కు సంబంధించి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఐకేపీ, పీఏసీఎస్, ఎఫ్‌పీఓ ద్వారా సుమారు 323 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా మండలాల్లో రైతులు ధాన్యాన్ని సెంటర్లను తీసుకొస్తున్నారు. కొన్ని చోట్ల ధాన్యం కొనుగోలు కూడా చేశారు. అయితే కొన్న ధాన్యాన్ని మాత్రం రవాణా చేయడంలేదు. ధాన్యం కొని రోజులు గడుస్తున్నా అక్కడే నిలిచిపోతున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యాన్ని రవాణా చేస్తేనే ఆ తర్వాత వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అవకాశం ఉంటుందని రైతులు చెబుతున్నారు. పాత ధాన్యం ట్రాన్స్‌పోర్ట్ చేయకపోవడంతో కొనుగోళ్లు కూడా సరిగా ముందుకు సాగడం లేదు. ఈ పరిస్థితి ప్రధానంగా ఆలేరు, యాదగిరిగుట్ట, మోత్కూరుతోపాటు తదితర మండలాల్లో నెలకొంది.

### కొరత ఇలా..

గతంలో ధాన్యం కొనుగోలు చేస్తే ఎప్పటికప్పుడు ధాన్యాన్ని మిల్లులకు రవాణా చేసేది. ఇందుకోసం ఎప్పటికప్పుడు లారీల ఇబ్బంది లేకుండా చూసేవారు. కానీ, ప్రస్తుత సీజన్‌లో పరిస్థితి మారింది. పలు మండలాల్లో లారీల కొరత ఏర్పడింది. అయితే ఒక్కసారి వచ్చిన లారీలు తిరిగి రాకుండా అటే పోతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. కాగా, లారీ ఓనర్లు సిండికేట్‌గా ఏర్పడి కావాలనే కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కో బస్తాకు రూ.10 చొప్పున ఇవ్వాలంటున్నట్లు ప్రచారం జరుగుతున్నది.

### వర్షం ముప్పుతో ఆందోళనలో రైతన్న

ధాన్యం ఎప్పటికప్పుడు కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులు వాటిని ప్రతిరోజు ఆరబెట్టి రాత్రిపూట కుప్పలు పోస్తున్నారు. ఇప్పటికే పలుచోట్ల వర్షసూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నది. ఇలాంటి సమయంలో ధాన్యం కొనుగోళ్లు నిలిపోవడంతో వర్షం వస్తే తడిసి ముద్దయ్యే ప్రమాదం ఉంది. రైతులు వరికుప్పలపై పాలిథిన్ కవర్లు కప్పుతున్నారు. ధాన్యం తడిస్తే ధాన్యం మొలకెత్తుతుందని, తడిచిన ధాన్యం కొంటారో లేదో అనే ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### లారీల కొరత వెంటనే తీర్చాలి



ధాన్యం కొనుగోలు చేసి మిల్లులకు తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. కొనుగోలు కేంద్రంలో ధాన్యం నిల్వలు పెరుగుతుండడంతో అకాల వర్షాలతో ధాన్యం తడుస్తుందనే భయాందోళన రైతుల్లో పెరిగింది. కండ్లు మూసుకున్న గుడ్డి ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకోకపోతే జరుగబోయే నష్టం భారీగానే ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం లారీలను తగినంత సంఖ్యలో కొనుగోలు కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలి.

–నిమ్మల శంకర్, రైతు, కొలనుపాక

### బీ-గ్రేడ్‌కే కొంటున్నరు..

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లకు నిర్వాహకులు వివిధ కొర్రీలు పెడుతున్నారు. నాణ్యమైన ధాన్యానికి ఏ-గ్రేడ్, ఆ తర్వాత ధాన్యానికి బీ-గ్రేడ్‌కు కొంటారు. అయితే రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకొచ్చినా తేమ, తాలు, క్వాలిటీ లేదంటూ సాకులు చెబుతూ తక్కువకు కొంటున్నారు. అధిక శాతం సెంటర్లలో బీ-గ్రేడ్‌కే కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తున్నది. దాంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇక గుండాల, తుర్కపల్లి, యాదగిరిగుట్ట మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు సరిగా జరగడం లేదు. అధికారులు వెంటనే స్పందించి వేగంగా ధాన్యాన్ని కొనుగోలు చేయడంతోపాటు మిల్లులకు రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

## రాజాపేటలో వడగండ్ల వాన

- నేల రాలిన వరి, మామిడి
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

రాజాపేట, ఏప్రిల్ 19 : మండలంలోని సింగారం, జాల, కొత్తజాల గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం కురిసింది. దాంతో ధాన్యం నేలరాలి చేలు నేల వాలాయి. భారీ ఈదురుగాలులకు మామిడి కాయలు రాలాయి. రేకుల కొట్టాలు ఎగిరిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయ్యింది. అకాల వడగడ్ల వానతో అపార నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. సుమారు 60 ఎకరాల్లో వరి ధాన్యంతోపాటు మామిడి తోటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.



రాజాపేట : జాల గ్రామంలో నేలవాలిన వరిచేను



రాజాపేట : సింగారంలో తడిసిన ధాన్యం

### పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

అకాల వడగండ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని జాలలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న వరి పొలాలతోపాటు నేల రాలిన మామిడి, ఎగిరిపడిన కొట్టాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అకాల వర్షంతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, బీఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, ఆలేరు మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు పాల్గొన్నారు.